క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు హేయం



ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజున్‌కుబ్రాకు వినతిపత్రం అందిస్తున్న జాప్ నేతలు

ధర్మవరం అర్బన్: పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయాలని చూడటం హేయమని, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసుల వేధింపులు ఆపాలని జాప్ పట్టణ అధ్యక్షుడు సురేష్, చిరంజీవి, పవన్ కోరారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఏఓ ఖతిజున్‌కు బ్రాకు జాప్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం విజయవాడలోని సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో పోలీసులు అనుమతి లేకపోయినా సోదాలు చేయడం దారుణమన్నారు. ఏపీయూడబ్ల్యూజేఎఫ్ గౌరవాధ్యక్షుడు శ్రీశైలం భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కదిరి అర్బన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాళసముద్రం గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ (55) అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 8న గురుకుల పాఠశాల వద్ద వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీ కొన్న ఘటనలో కుమారుడు ఆదినారాయణ మృతి చెందగా, అతడి తల్లి నాగలక్ష్మమ్మ తీవ్రంగా గాయపడింది.

భారంగా బంగారు రుణం

- రుణాల రెన్యూవల్‌లో ఖాతాదారుల అవస్థలు
- అసలు, వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయాలంటున్న అధికారులు
- చివరకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న ఖాతాదారులు





తాడిమర్రి స్టేట్ బ్యాంక్.

తాడిమర్రి: పంటల సాగు కోసం బ్యాంకుల్లో బంగారం (నగలు) తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న రైతులు వాటి రెన్యూవల్ తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాడిమర్రి స్టేట్ బ్యాంక్‌లో ప్రస్తుతం 2,040 మంది రైతులు బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నారు. గతంలో బంగారం తాకట్టు రుణాల రెన్యూవల్‌లో అధికారులు కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలను రెన్యూవల్ చేస్తుండేవారు. ఎవరైనా రైతులు వడ్డీ కట్టడానికి డబ్బు లేదంటే రుణం మొత్తాన్ని పెంచి వడ్డీ డబ్బు జమ చేసుకునేవారు. అయితే ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ ఇండియా(ఆర్‌బీఐ) నూతన విధానం ప్రవేశ పెట్టింది. ఈ విధానంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేగాక గతంలో పంట రెన్యూవల్ ఒక రోజులోనే పూర్తయ్యేది. ప్రస్తుత పరిస్థితి అలా లేదు. రుణం రెన్యూవల్ కోసం ఒక రోజు డబ్బు చెల్లిస్తే మరుసటి రోజున తిరిగి రుణం తీసుకోవాల్సి వస్తోంది. దీంతో రైతు రెండు, మూడు రోజుల కాలయాపనతో పని లేకుండా బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొంది. బంగారు రుణాల రెన్యూవల్ కోసం అసలు, వడ్డీకి డబ్బు లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

వడ్డీ వ్యాపారులే దిక్కు



పంట పెట్టుబడుల కోసం బ్యాంక్‌లో బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాం. రుణం తీసుకుని ఏడాది కావడంతో రెన్యూవల్ చేయాలని అధికారులు తెలియజేశారు. దీంతో బ్యాంక్ రాగా అసలు, వడ్డీ కట్టాలని అధికారులు తెలిపారు. దీంతో ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితి. రెన్యూవల్ కోసం రూ.1. 10 లక్షలు కావాల్సి ఉండగా అంత డబ్బు బదులిచ్చేవారు లేరు. చివరకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వచ్చింది.

–ముత్యాల రామన్న, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి.

రైతుల నడ్డి విరుస్తున్నాయి..



బంగారం తాకట్టు రుణాల రెన్యూవల్‌లో బ్యాంకులు రైతుల నడ్డి విరుస్తున్నాయి. అసలు, వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేయాలని చెప్పడం దారుణం. దీంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చివరకు రైతులు బంగారు రుణాల రెన్యూవల్ కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రెండు రోజులకే వేలాది రూపాయలు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకుంటున్నారు. అసలు, వడ్డీ కడితే అది రెన్యూవల్ ఎలా అవుతుందో అధికారులకే తెలియాలి.

–పార్నపల్లి, నారాయణ, తాడిమర్రి

రూ.లక్షకు రూ.2 వేల వడ్డీ..

బంగారు రుణాల రెన్యూవల్ కోసం రైతులు చివరకు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరం వ్యాపారస్తులకు వరంగా మారుతోంది. రెండు రోజుల గడువుతో వడ్డీ వ్యాపారస్తులు రూ.లక్షకు రూ.2 వేలు, రూ.2 లక్షలకు రూ.4 వేలు, రూ.5 వేలు తీసుకుంటూ అన్నదాతల నడ్డి విరుస్తున్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో పంట రుణాలు రెన్యూవల్ చేస్తే పావలా వడ్డీ తిరిగి వచ్చేది. అదీకాక పంట రుణాల రెన్యూవల్ కోసం ప్రభుత్వమే రూ.లక్షకు ఇంత చొప్పున ప్రీమియం చెల్లించేది. అయితే ఈ కూటమి ప్రభుత్వంలో పావలా వడ్డీ, పంటల బీమా ప్రీమియం చెల్లించడం లేదు. దీంతో పంట రుణాల రెన్యూవల్‌లో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి వడ్డీ, అసలు కట్టే పద్ధతిని తొలగించాలని రైతులు కోరుతున్నారు.

వీర జవాన్‌కు నివాళి

నల్లమాడ: జమ్ము కశ్మీర్‌లోని రాజోరి ప్రాంతం వద్ద జరిగిన కాల్పుల్లో గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన జవాన్ మురళీనాయక్ మృతి చెందడంపై జెడ్పీటీసీ, న్యాయవాది ఎస్. రామచంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో నివాళులర్పించారు. జవాన్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించి వీర జవాన్ మురళీ నాయక్ పేరు చరిత్రలో నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు..సత్యసాయి నగర్‌కు చెందిన రాజుపాల్యం గురుశేఖర్‌కు వీరయ్య, మద్దిలేటితో చిన్నపాటి గొడవలు, మనస్పర్థలు ఉన్నాయి. గురువారం రాత్రి వీరయ్య, మద్దిలేటి ఇద్దరు ఇనుప పైపు, కట్టెలు తీసుకుని గురుశేఖర్ ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి అతడిని, భార్య, బంధువులను కొట్టి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: మద్యానికి బానిసై భార్యను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలు.. పట్టణంలోని సుందరయ్యనగర్‌లో నివసిస్తున్న ముద్దుకృష్ణ ఐదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఎలాంటి పని చేయకుండా అనుమానంతో భార్య అనురాధను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. వేధింపులు తాళలేక శుక్రవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గరుడ వాహనంపై శ్రీవారు

ధర్మవరం అర్బన్: స్థానిక లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం శేష వాహనం, రాత్రి గజ వాహనంపై స్వామిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

నేడు చెన్నకేశవస్వామి రథోత్సవం

ఉత్సవాల్లో కీలకమైన రథోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7గంటలకు మడుగు తేరును ఉభయదాతలు సమక్షంలో లాగుతారు. అనంతరం భక్తుల దర్శనార్థం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు రథం వద్ద స్వామిని దర్శించుకునే ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం ఉంటుంది. ఏర్పాట్లను ఆలయ ఈఓ వెంకటేషులు, అడహక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీష్ పర్యవేక్షిస్తున్నారు. రథోత్సవం సందర్భంగా ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ పర్యవేక్షణలో వన్‌టౌన్, టూ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డెప్ప ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



గరుడ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులు

సంక్షిప్త సమాచారం

టార్పాలిన్ల పంపిణీ

కదిరి టౌన్: పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ సత్యనారాయణ రైతులకు పంటల సాగుతోపాటు వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆత్మీయ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ తరపున రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటేష్‌నాయక్, ఎంసీఓ బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, రైతులు వీసీఓలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

ధర్మవరం అర్బన్: డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ ఇవ్వనున్నట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి వెంకటేష్ విష్ణువర్ధన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందించాలని సూచించారు.

హైస్కూళ్లలో అప్‌గ్రేడ్ పోస్టుల మంజూరు హర్షణీయం

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ నిరంతర ప్రాతినిధ్యం, కృషితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ హైస్కూళ్లలో అప్‌గ్రేడ్ పోస్టులు మంజూరయ్యాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ ఉపాధ్యాయులతో కలిసి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ యూటీఎఫ్ నిరంతర ప్రాతినిధ్యాలు, కృషి వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ హైస్కూల్స్‌లో సుమారు 1800 పోస్టులు హైస్కూల్ హెడ్ మాస్టర్స్, స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేశారన్నారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, జిల్లా మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ బిల్లె రామాంజనేయులు, నాయకులు ఆంజనేయులు, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, సాయిగణేష్, హెచ్.రామాంజనేయులు, ఆదిశేషు, హరిశంకర్ పాల్గొన్నారు.

తలుపుల ఎంపీడీఓగా నసీమా

తలుపుల: మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా నసీమా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇది వరకూ ఇక్కడే ఈఓఆర్డీగా పని చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం చేసుకుని మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

నల్లమాడ: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నల్లమాడలోవాల్మీకి సంఘం నేత రమేష్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు.రమేష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటనలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామంటూ ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టామన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలోకి తెద్దాం

పుట్టపర్తి టౌన్: అనుకున్న లక్ష్యాలను సాధించి ఆర్టీసీని లాభాల బాటలోకి తెద్దామని డీపీటీఓ మధుసూదన్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ పర్సన్లు, అకౌంట్స్ డిపార్టుమెంట్ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని డిపోల్లో ఆదాయం పెంచేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

ముదిగుబ్బ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో సరోజమ్మ కళా బృందంతో వీధి నాటకం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముదిగుబ్బ వైద్యాధికారి రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

ఓడీచెరువు: ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్ బీజేపీ నేతలు మండల కేంద్రంలో శుక్రవారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు వీరాంజనేయులు, నాయకులుమేకల వెంకట రమణ, కిష్టప్ప, రంగారెడ్డి, పీట్ల సుధాకర్, నిజాం తదితరులు పాల్గొన్నారు

నాటుసారా విక్రేత అరెస్ట్

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లి తండాలో నాటుసారా విక్రయిస్తున్న మూడే బాలూనాయక్ అనే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్ విధించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి

తలుపుల: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు అష్ఫాప్, అశ్రిత ఆధ్వర్యంలో శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 67 మందికి పరీక్షలు చేయగా 11 మంది రక్తహీనత ఉన్నట్లు గుర్తించి, వారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ వేశారు. అలాగే 14 మందిని అల్ట్రా సౌండ్ స్కానింగ్‌కు కదిరి ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. అనంతరం మున్నూర్ బృందం గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు.

అయ్యప్పస్వామి ఆలయానికి రథం అందజేత

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేశవనగర్‌లో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయానికి ఓంకార్ సిల్క్స్ అధినేతలు రథం అందించారు. శుక్రవారం అయ్యప్పస్వామి ఆలయ ట్రస్టీ గురుస్వామి పీజే విజయ్‌కుమార్‌కు రథాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆలయం ధర్మవరంలో ప్రతిష్ఠించడం సంతోషంగా ఉందన్నారు.